# తొలివెలుగు

జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 188 | శనివారం | 25-7-2026








PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08


## అమెరికా రోడ్డు ప్రమాదంలో తెలంగాణ యువకుడి మృతి.. విషాదంలో కుటుంబం




- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నిత్యానంద రెడ్డి
- చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు నిర్ధారణ
- ఎంఎస్ పూర్తి చేసి డెట్రాయిట్‌లో ఉద్యోగం చేస్తున్న యువకుడు

## ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్ ఎందుకు లేరు?: మహేశ్ కుమార్ గౌడ్



- బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి లోపాయకారీ ఒప్పందం ఉందన్న మహేశ్ గౌడ్
- వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శ

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ: రాహుల్ గాంధీ



- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు నీట్‌పై చర్చ ఉండదన్న రాహుల్
- నీట్ వివాదంపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- సభలో తన మైక్‌ను లాగేసుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపణ
- విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్



# క్యూర్ జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు

- నగరానికి దూరంగా ఉంటే పేదల ఉపాధికి ఇబ్బందులొస్తాయి
- ఔటర్ లోపల అనువైన ప్రభుత్వ భూములు గుర్తించండి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాలకు సమీపంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరానికి దూరంగా ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, అందువల్ల పని ప్రాంతాలకు దగ్గర్లోనే ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిరుపయోగ భూములను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించాలని సీఎం ఆదేశించారు. ప్రతిగా సంబంధిత శాఖలకు ఇతర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని సూచించారు. దీంతో ప్రభుత్వ భూములు సద్వినియోగం కావడంతో పాటు పేదలకు నివాస సౌకర్యం కల్పించడం సులభమవుతుందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో అధికారులు ఇప్పటికే గుర్తించిన స్థలాల వివరాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన నిరుపయోగ భూములను ఈ పథకం కోసం వినియోగించే అవకాశాలపై చర్చించారు. సంబంధిత నియోజకవర్గాల్లో ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూముల గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్ష సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రధాన్ రాజీనామాపై సీజేపీ పట్టుదల

**ధర్మేంద్ర ప్రధాన్ తొలగింపే ప్రధాన డిమాండ్.. రాజీలేదని కేంద్రానికి సీజేపీ స్పష్టీకరణ**

- విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం డిమాండ్
- విద్యార్థులపై కేసులన్నీ ఎత్తివేయాలని పట్టుబాటు.. 3 డిమాండ్లతో కేంద్రానికి అల్టిమేటం
- నేడు మూడో విడత చర్చలు జరపనున్న కేంద్రం.. ప్రభుత్వ నిర్ణయంపై కొనసాగుతున్న ఉత్కంఠ

న్యూఢిల్లీ: నీట్–యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాల్సిందేనని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరోసారి స్పష్టం చేసింది. ఈ అంశంలో రాజీకి అవకాశం లేదని, ప్రభుత్వం నిర్ణయం తీసుకునేందుకు శనివారం మధ్యాహ్నం వరకు గడువు ఇస్తున్నట్లు ప్రకటించింది. గడువులోగా స్పందన రాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. పేపర్ లీక్, విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, సీజేపీ ప్రతినిధుల మధ్య శుక్రవారం ఢిల్లీలో రెండో విడత చర్చలు జరిగాయి. కేంద్రం తరఫున జేపీ నడ్డా, జితేందర్ సింగ్, సీజేపీ తరఫున సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా పాల్గొన్నారు. సుమారు రెండు గంటలపాటు


(మిగతా 2వ పేజీలో)






## విద్యార్థుల భవిష్యత్తును కాపాడతాం: సుప్రీం

- పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై దృష్టికి హామీ
- రాధాకృష్ణన్ కమిటీ అమలుపై అఫిడవిట్‌కు ఆదేశం
- మరిన్ని సంస్కరణలపై ప్రభుత్వం కసరత్తు
- కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు కీలక సూచనలు
- నీట్ వ్యవస్థలో సమగ్ర మార్పులపై విచారణ
- కేసు విచారణను ఆగస్టు 3కు వాయిదా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్రం చేపట్టే సంస్కరణలను నిశితంగా పర్యవేక్షిస్తామని సుప్రీంకోర్టు


(మిగతా 2వ పేజీలో)


# విద్యార్థుల ఆగ్రహాన్ని అణచలేరు: కేటీఆర్


- నీట్ లీక్‌లపై కేంద్రాన్ని నిలదీసిన బీఆర్ఎస్
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన కేటీఆర్
- యువత స్వరాన్ని అణచివేస్తే తీవ్ర పరిణామాల హెచ్చరిక
- లీక్‌లపై మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్
- విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- అవసరమైతే కేసీఆర్ అండగా ఉంటారని భరోసా

హైదరాబాద్: నీట్ పేపర్ లీక్ వ్యవహారంతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలపై దేశ యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. యువత స్వరాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు నిరసనగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఒక్కటే కాకుండా 12 ఏళ్ల బీజేపీ పాలనపై


(మిగతా 2వ పేజీలో)







## మోదీ సెల్ఫీ వీడియో ఎఫెక్ట్.. రాత్రికి రాత్రే 10 లక్షల ఫాలోవర్లు!

- పేపర్ లీక్‌లపై ప్రధాని మోదీ కీలక వీడియో సందేశం
- ఒక్కసారిగా 10 లక్షల మంది పెరిగిన ఇన్‌స్టా ఫాలోవర్లు
- మొత్తం ఫాలోవర్ల సంఖ్య 101 మిలియన్లకు చేరిక
- దోషులకు కఠిన శిక్షలు తప్పవని విద్యార్థులకు హామీ
- ప్రపంచంలోనే అత్యధిక ఫాలోవర్లు ఉన్న నేతగా మోదీ

ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయంపై ఆయన ఇచ్చిన భరోసాకు ప్రజల నుంచి విస్తృత ఆమోదం లభించిందనడానికి నిదర్శనంగా.. రాత్రికి రాత్రే ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో దాదాపు 10 లక్షల మంది కొత్త ఫాలోవర్లు చేరారు. దీంతో ఆయన మొత్తం ఫాలోవర్ల సంఖ్య 101 మిలియన్ల (10.1 కోట్లు) మైలురాయిని దాటింది. గురువారం రాత్రి ప్రధాని పోస్ట్ చేసిన ఈ సెల్ఫీ వీడియోలో, పేపర్ లీక్‌ల సమస్యపై


(మిగతా 2వ పేజీలో)

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ: రాహుల్ గాంధీ

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు నీట్‌పై చర్చ ఉండదన్న రాహుల్**

**నీట్ వివాదంపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

**సభలో తన మైక్‌ను లాగేసుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపణ**

**విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని విపక్షాల డిమాండ్**

**మంత్రి రాజీనామా డిమాండ్‌తో పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు లోక్‌సభలో ఎలాంటి చర్చకూ ఒప్పుకునేది లేదని విపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించాకే తదుపరి సంభాషణ ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వాయిదా పడిన కాసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు, పేపర్ లీకేజీల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో ప్రకటించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు తెస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, రాహుల్ గాంధీ చర్చకు సహకరించాలని రిజిజు కోరారు. అనంతరం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తన మైక్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు.



విద్యార్థుల తరఫున విపక్షాలు మూడు ప్రధాన డిమాండ్లు చేస్తున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. అవి:

1. "అవినీతిపరుడైన" విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. 2. నిరసన చేస్తున్న విద్యార్థులపై దాడి చేసి, కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి. 3. విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి.

"ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించే వరకు మేం ఎలాంటి చర్చలు జరపబోం," అని రాహుల్ దృఢంగా చెప్పారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి నీట్–యూజీ పరీక్ష పత్రాల లీకేజీ అంశం పార్లమెంటును కుదిపేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కొత్త చట్టం తెచ్చామని చెబుతున్నప్పటికీ, మంత్రి రాజీనామా చేయాల్సిందేనని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ వివాదంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది.

# అమెరికా రోడ్డు ప్రమాదంలో తెలంగాణ యువకుడి మృతి.. విషాదంలో కుటుంబం

**రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నిత్యానంద రెడ్డి**

**చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు నిర్ధారణ**

**ఎంఎస్ పూర్తి చేసి డెట్రాయిట్‌లో ఉద్యోగం చేస్తున్న యువకుడు**

అమెరికాలో ఉన్నత చదువులు చదివి ఉద్యోగంలో స్థిరపడిన తెలంగాణ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. నిర్మల్ జిల్లాకు చెందిన నిత్యానంద రెడ్డి (26) చికిత్స పొందుతూ కన్నుమూశాడు. బ్రెయిన్ డెడ్ కారణంగా అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త తెలియడంతో అతని స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన నిత్యానంద రెడ్డి, అమెరికాలో ఎంఎస్ పూర్తి చేశాడు. అనంతరం మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్‌లో నివాసం ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. గత శనివారం తన బైక్‌పై బయటకు వెళ్లగా, వేగంగా వచ్చిన ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిత్యానంద రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సమయంలోనే అతని పరిస్థితి విషమించింది. నిన్న బ్రెయిన్ డెడ్ కావడంతో మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ సమాచారాన్ని కుటుంబ




సభ్యులకు అందించారు. ఒక్కగానొక్క కొడుకు మరణవార్త విని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## జోగి రమేశ్ కుటుంబంపై మరో వివాదం... పోలీసులకు ఫిర్యాదు చేసిన కోడలు మేఘన



మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేశ్ కుటుంబం తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోంది. తనను వరకట్నం కోసం వేధిస్తున్నారని, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన కోడలు మేఘన పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు జోగి రమేశ్, ఆయన కుమారుడు రాజీవ్ సహా కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు గృహ హింస కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే, జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌తో మేఘనకు గత ఏడాది మే నెలలో వివాహం జరిగింది. పెళ్లైన కొన్నాళ్ల నుంచే అదనపు కట్నం కోసం భర్త రాజీవ్, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు తనను వేధించడం ప్రారంభించారని మేఘన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా ఫలితం లేకపోయిందని, వేధింపులు మరింత ఎక్కువయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తనకు ప్రాణహాని ఉందని భావించిన మేఘన, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గృహ హింస, వరకట్న వేధింపులు, మోసం, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద జోగి రమేశ్, ఆయన కుమారుడు రాజీవ్ సహా మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, సాక్ష్యాధారాలు సేకరించి త్వరలోనే నిందితులను విచారిస్తామని ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు.

## మోదీ సెల్ఫీ వీడియో ఎఫెక్ట్.. రాత్రికి రాత్రే 10 లక్షల ఫాలోవర్లు!

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడుతున్న తీవ్రమైన ఆవేదనను తాను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. గత రెండున్నర నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మోదీ స్పష్టం చేశారు. ఇటీవల దాదాపు 22 లక్షల మంది విద్యార్థుల కోసం ఎలాంటి జాప్యం లేకుండా పరీక్షలు నిర్వహించామని, కేవలం ఐదు రోజుల క్రితం జులై 19న ఫలితాలు కూడా ప్రకటించామని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా విజయం సాధించిన విద్యార్థుల నుంచి ఆనందకరమైన వార్తలు వస్తున్నాయని అన్నారు. ఇంతటితోనే తమ ప్రభుత్వం సంతృప్తి పడదని, పరీక్షల అక్రమాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేలా ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ఒక బలమైన ప్రతిపాదనను తాను వ్యక్తిగతంగా సిద్ధం చేశానని ఆయన వెల్లడించారు. ఈ పరిణామం ప్రపంచ వేదికపై ప్రధాని మోదీకి డిజిటల్ మాధ్యమాల్లో ఉన్న భారీ ఆదరణను మరోసారి రుజువు చేసింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది ఫాలోవర్లు ఉన్న రాజకీయ నాయకుడిగా, ప్రపంచ నేతగా ఆయన కొనసాగుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి ఇతర ప్రముఖ అంతర్జాతీయ నేతలతో పోలిస్తే మోదీ ఫాలోవర్ల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ వీడియో ద్వారా అసమ్మతి తెలిపేవారితో చర్చకు సిద్ధమనే సంకేతం ఇస్తూనే, అవినీతిపై తన ప్రభుత్వ జీరో టాలరెన్స్ విధానాన్ని చాటుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పార్టీ మార్పు వార్తలపై మల్లారెడ్డి క్లారిటీ

**మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారంటూ జోరుగా ప్రచారం**

**ఆ ప్రచారంలో నిజం లేదన్న మల్లారెడ్డి**

**కేటీఆర్ ను సీఎంగా చూడటమే తన లక్ష్యమని వెల్లడి**



రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులుగా తన పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెక్ పెట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఆయన, తాను బీఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలోకి వెళు_న్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ప్రచారమేనని స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నాననే రూమర్లను నిజమని నమ్మి ఒక అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తనను ఎంతగానో కలచివేసిందని మల్లారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ అభిమానిని నేరుగా కలిసి మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ... కేటీఆర్ 125 ఏళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన ప్రధాన లక్ష్యమని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు: బండి సంజయ్

**విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి సంజయ్**

**నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య.. ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారు: సంజయ్**



ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు. నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

## ప్రధాన్ రాజీనామాపై సీజేపీ పట్టుదల

జరిగిన సమావేశంలో మూడు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీజేపీ నేతలు కేంద్ర మంత్రులకు అందజేశారు. సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ మూడు డిమాండ్లలో రెండింటికి కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అయితే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పష్టమైన నిర్ణయం వెలువడాల్సి ఉందన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ ఉద్యమాన్ని విరమించబోమని స్పష్టం చేశారు. మరోవైపు కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ సీజేపీ ప్రతిపాదించిన అంశాలపై ప్రభుత్వంతో అంతర్గతంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శనివారం మధ్యాహ్నం మరోసారి సమావేశమై ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేస్తామని చెప్పారు. పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు సంబంధించిన సీజేపీ సూచనలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. సీజేపీ ప్రధాన డిమాండ్లలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు, పేపర్ లీక్ ప్రభావంతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ?1 కోటి చొప్పున పరిహారం చెల్లించడం, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవడం ఉన్నాయి. ఈ డిమాండ్లపై కేంద్రం తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## విద్యార్థుల ఆగ్రహాన్ని అణచలేరు: కేటీఆర్

పేరుకుపోయిన అసంతృప్తే యువత ఉద్యమానికి కారణమని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం లీకేజీలపై సమాధానం చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, వారిపై జరిగిన పోలీసు చర్యలకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, అవసరమైన సమయంలో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కూడా వారికి అండగా నిలుస్తారని తెలిపారు. విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయ ఎజెండాలతో బలహీనపరచే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ఉద్యమాన్ని స్వతంత్రంగా కొనసాగించాలని, తమ పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పేపర్ లీక్ అంశంలో తనపై వస్తున్న ఆరోపణలను ఖండించిన కేటీఆర్.. తాను తప్పు చేసి ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును కాపాడతాం: సుప్రీం

స్పష్టం చేసింది. తాత్కాలిక చర్యలతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని పేర్కొంటూ పరీక్షల నిర్వహణ వ్యవస్థను సమగ్రంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆలోక్ ఆరాధే ధర్మాసనం నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏను ఆదేశించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులకు మించి మరిన్ని సంస్కరణలపై ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలో పడనివ్వబోమని కోర్టుకు హామీ ఇచ్చారు. సమగ్ర నివేదిక సమర్పించేందుకు కొంత సమయం కావాలని కోరారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేసింది. నీట్ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా)తో పాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది.

## ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్ ఎందుకు లేరు?: మహేశ్ కుమార్ గౌడ్

ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న లోపాయకారీ ఒప్పందం కారణంగానే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి నిరసన తెలపలేకపోయారని ఆయన విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు తెచ్చుకుని, వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపించారు. దేశంలో పలు ప్రాంతీయ పార్టీల వలే బీఆర్ఎస్ కూడా బీజేపీ గుప్పిట్లోనే ఉందనేది పచ్చి నిజమని, అందుకే గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రతిపాదించిన బిల్లులన్నింటికీ బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లకపోయినా, నీట్ ఉద్యమానికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచారని అన్నారు. నెల రోజులుగా నీట్ సమస్యపై స్పందించని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ధర్నా చౌక్ వద్ద కూర్చుని నాటకాలు ఆడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎన్ని వేషాలు వేసినా ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లోకి వెళ్లే ధైర్యం వారికి ఉందా అని నిలదీశారు. గత పాలనలో ఎంతోమంది విద్యార్థుల బలవన్మరణాలకు, నిరుద్యోగుల ఆత్మహత్యలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సాగిన పోలీసు రాజ్యం, విచ్చలవిడిగా జరిగిన ఇసుక మాఫియా దోపిడీని తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన ధ్వజమెత్తారు. నీళ్ల ప్రాజెక్టుల గురించి హరీశ్ రావు మాట్లాడుతున్నారని, కానీ వారి పాలనలో నీళ్ల పేరుతో జరిగిన భారీ దోపిడీ, అక్రమాలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని స్పష్టం చేశారు.

## వైరల్ వీడియో కేసులో తీర్పు

**బాలుడికి వినూత్న శిక్ష విధించిన జువైనల్ బోర్డు**

**నిందితుడైన మైనర్‌కు నెల రోజుల సామాజిక సేవ శిక్ష విధింపు**

**రోజూ ఉదయం 10 నుంచి 2 వరకు జువైనల్ బోర్డులో రిపోర్ట్ చేయాలని ఆదేశం**

గతేడాది తెలంగాణవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చాదర్‌ఘాట్ ఆటో వేధింపుల కేసులో నాంపల్లి జువైనల్ జస్టిస్ బోర్డు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మైనర్‌కు నెల రోజుల పాటు సామాజిక సేవ (కమ్యూనిటీ సర్వీస్) చేయాలని ఆదేశించింది. నిందితుడిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం, అతడిని సంస్కరించడమే లక్ష్యంగా ఈ తీర్పునిచ్చినట్లు బోర్డు పేర్కొంది. బోర్డు ఆదేశాల ప్రకారం.. సదరు బాలుడు నెల రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయంలో హాజరై రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 2023 నవంబర్ 7వ తేదీ రాత్రి, హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ వంతెనపై కదులుతున్న ఆటోలో ఒక మహిళను వేధించిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో చాదర్‌ఘాట్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. పెట్రోలింగ్ బృందం సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు మైనర్ అని తేలడంతో కేసును జువైనల్ జస్టిస్ బోర్డుకు బదిలీ చేశారు. ఈ కేసు ఫైలును తదుపరి చట్టపరమైన చర్యల కోసం 5వ వీఏసీజేఎం (వాజజీవీ) కోర్టుకు పంపినట్లు చాదర్‌ఘాట్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

## మృత్యువుతో పోరాడి.. రైతు దుర్మరణం



**తొలివెలుగు, రాజాపేట:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రైతు మృత్యువుతో పోరాడి కన్నుమూశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన రైతు వల్లూరి వీరస్వామి (55) ఈనెల 12వ తేదీ రాత్రి ద్విచక్రవాహనంపై యాదగిరిగుట్టకు బయలుదేరారు. గౌరాయపల్లి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా పంది అడ్డురావడంతో వాహనం నియంత్రణ తప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, శరీర భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఈనెల 14న నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. మృతుడి కుమారుడు వల్లూరి అశోక్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు యాదగిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావుకు ఘన సత్కారం



**తొలివెలుగు, రాజాపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత, వస్త్ర శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) శ్రీనివాసరావును రాజాపేట మండలం బొందుగుల శ్రీ వెంకటేశ్వర సిల్క్ చేనేత సహకార సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పుట్ట వీరయ్య, ఉపాధ్యక్షుడు మదూరి జ్ఞానవర్ధన్, కార్యదర్శి కుందన దత్తాద్రి, డైరెక్టర్లు బొమ్మ సిద్ధిలింగం, గోలి ఆంజనేయులు పూలమాల, దుశ్శాలువాతో ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఏడీ శ్రీనివాసరావు సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజాపేటలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



**తొలివెలుగు, రాజాపేట:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసుల లాఠీచార్జ్, అక్రమ అరెస్టులను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రాజాపేట మండలంలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ప్రైవేట్ విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించగా, మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా రఘునాథపురంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో లోపాలు, ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌ల కోతలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. బంద్‌కు సహకరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బల్ల మహేష్‌తో పాటు కటకం ప్రశాంత్, కటకం గణేష్, కలకుంట్ల సంపత్, గోలి కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే ధ్యేయం.. సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- రూ.15 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మాణ పనులు
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల కేంద్రంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ కోయ మధు ప్రారంభించారు. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) నిధుల నుంచి ఈ పనులకు మంజూరు లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు సహకరించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు గ్రామ ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, అఖిలపక్ష నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.






## సమస్యల పరిష్కారానికై.. 'తపస్' చలో హైదరాబాద్

ఆగస్టు 1న నిర్వహించే మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో జరుగుతున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం 'తపస్ చలో హైదరాబాద్' రాష్ట్రస్థాయి మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల విద్యాధికారి చందా రమేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధానోపాధ్యాయుడు తడక రాజు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆగస్టు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు దుడుకు జానయ్య, జిల్లా బాధ్యులు పలుగుల రాజు, కటకం నాందేవ్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాగునీరందించి.. వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేయాలి

- కాళేశ్వరం 15వ ప్యాకేజీ కాల్వల పనులను పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీలు నెరవేర్చాలి: బీఆర్ఎస్ నేత బాలలక్ష్మి

**తొలివెలుగు, రాజాపేట :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 15వ ప్యాకేజీ కింద మిగిలిన కాల్వల నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి రాజాపేట మండలంలోని చెరువులు, కుంటలను నింపి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని, 15వ ప్యాకేజీ ద్వారా రాజాపేట మండలానికి సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆరు నెలల్లో చెరువులను నింపి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుకు నిధులు మంజూరై కొంత మేర కాల్వల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్న బాలలక్ష్మి, కాళేశ్వరం 15వ ప్యాకేజీ కాల్వల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి చెరువులకు నీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. దీంతో రాజాపేట మండల వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంతో పాటు వేలాది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందని ఆమె అన్నారు.



## సీనియర్ సిటిజన్ల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రభుత్వ కల్పించిన అవకాశాలను పూర్తిగా వినియోగిస్తాం: రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు నరసయ్య

**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్ల హక్కుల పరిరక్షణతో పాటు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ అవకాశాలను పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు నరసయ్య తెలిపారు. రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో మండల అధ్యక్షుడు జెల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ (తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమం) చట్టం--2007తో పాటు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆర్‌సి. నెం.590/సి2/డబ్ల్యూ ఎస్ డబ్ల్యూ/2023-26 సర్క్యులర్‌లో పొందుపరిచిన అన్ని సంక్షేమ అవకాశాలను వృద్ధులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీనియర్ సిటిజన్ల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. వృద్ధులు నిరాదరణ, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలు, చట్టబద్ధమైన హక్కులను ప్రతి వృద్ధుడు సద్వినియోగం చేసుకోవాలని, ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా సంస్థ నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి సీనియర్ సిటిజన్ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహా, సీనియర్ సిటిజన్స్ నాయకులు అప్పం రామేశ్వరం, మిరియాల భాస్కర్, కూనూరు సుదర్శన్, రాపోలు పుండరీకం, పగడాల గణేష్, ఏలే నరసింహా తదితరులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ
- కేటీఆర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బీఆర్ఎస్ నాయకుల ఆకాంక్ష



తొలివెలుగు, చౌటుప్పల్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్‌ను ఉచితంగా పంపిణీ చేసి మానవతా సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, రాజకీయ జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఊదరి యాదయ్య, ఢిల్లీ మాధవరెడ్డి, పరమేశ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, నల్ల పర్వతాలు యాదవ్, శ్రీకాంత్, అత్తర్ పాషా, మెట్టు మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

రామన్నపేటలో పోలీసుల విస్తృత తనిఖీలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: సీఐ మోలుగూరి రవి

**తొలివెలుగు, రామన్నపేట:** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ నిబంధనల అమలుపై అవగాహన కల్పించేందుకు రామన్నపేట మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం విస్తృత వాహనాల తనిఖీలు నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోలుగూరి రవి, ఎస్ఐ గోపాతి సతీష్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లు, రహదారులపై ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ (పీయూసీ) ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సీఐ మోలుగూరి రవి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణ రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అందుకే క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు కోరారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రాఘవేంద్ర, కృష్ణమూర్తి, నరసింహ, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## భూగర్భ జలాల సంరక్షణకే.. ఇంకుడు గుంతలు

- పనులను ప్రారంభించిన సర్పంచి నడిమింటి నరేష్
- ప్రజలంతా సహకరించాలని పిలుపు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం దూదివెంకటాపురం గ్రామంలో భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిల్వను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇటువంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరిగి రైతులు, గ్రామ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి

## గారాజాపేటలో కేటీఆర్ బర్త్‌డే సంబరాలు

గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన శ్రేణులు

పాఠశాలలకు వాలీబాల్స్ అందజేసిన బీఆర్ఎస్ నేతలు






**తొలివెలుగు, రాజాపేట:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహం కూడలి వద్ద మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుతూ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల క్రీడా ప్రోత్సాహం కోసం వాలీబాల్స్‌ను అందజేశారు. పాఠశాలల పీడీలు ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బెడిద వీరేశం, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, సర్పంచ్ జెన్నపల్లి బాలరాజు రెడ్డి, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ంధీ, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెరిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

అధ్యక్షుడిగా గుండ్ల నిరంజన్ ఎంపిక

చిన్నగూడూరులో కుల సంఘం సమావేశం

**తొలివెలుగు, చిన్నగూడూరు:** చిన్నగూడూరు మండల కేంద్రంలో శుక్రవారం పెరిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గుండ్ల నిరంజన్, ఉపాధ్యక్షుడిగా బెడద శీను, ప్రధాన కార్యదర్శిగా కీలిశెట్టి రాము, సలహాదారుగా నీలం వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గుండ్ల నిరంజన్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కుల సంఘం సభ్యులు, పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు మన్నె చెన్నయ్య, నీలం వీరన్న, పేరం కృష్ణ, మేకల రమేష్, పేరం రవి, బెడద నారాయణ, నీలంబిక్షం, ఎర్ర చిట్టి వెంకటేష్, నట్టే మన్నెమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# గీత కార్మికుల హక్కుల కోసం 'చైతన్య బస్సు యాత్ర'



- ఆగస్టు 9న రామన్నపేటకు రానున్న బస్సు యాత్ర బృందం
- పోస్టర్‌ను ఆవిష్కరించిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు
- ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** కల్లుగీత కార్మికుల హక్కుల పరిరక్షణ, వృత్తి రక్షణ, సంక్షేమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన గీతన్నల చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గాజుల ఆంజనేయులు పిలుపునిచ్చారు. రామన్నపేట మండల కల్లుగీత కార్మిక సంఘం సమావేశం శుక్రవారం కూనూరు మల్లేశం అధ్యక్షతన నిర్వహించగా, గాజుల ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 2 నుంచి 18 వరకు మానుకోట నుంచి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు గీతన్నల చైతన్య బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 9న రామన్నపేటకు చేరుకునే బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికి, పెద్ద సంఖ్యలో గీత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నాయకులు గీతన్నల చైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాలకు గురైన కార్మికులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని, వృత్తి రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించి తగిన నిధులు కేటాయించాలని గాజుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. గీత కార్మికులకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు ప్రభుత్వ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

వృత్తి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆసరా పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచాలని, వికలాంగులైన గీత కార్మికులకు రూ.6 వేల పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వృత్తికి అవసరమైన పరికరాలు, భద్రతా సామగ్రి, ద్విచక్ర వాహనాలను ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర రవీందర్, జిల్లా సహాయ కార్యదర్శి బావండ్లపల్లి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కూనూరు మల్లేశం, మునికుంట్ల లెనిన్, మండల కమిటీ సభ్యులు పబ్బు సత్తయ్య, పబ్బు వెంకన్న, పబ్బు శేఖర్, గంగాదేవి అంజయ్య, పల్సం కనకయ్య, పల్లె సత్యం, పబ్బు స్వామి, కూనూరు మహేష్, బావండ్లపల్లి సత్యం, కూనూరు అంజయ్య, సుర్వి నవీన్, గోపగోని శంకరయ్య, గంగాపురం గోపాల్, గోపగోని వీరస్వామి, కమ్మగాని అశోక్, వీరమల్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

- సుభాష్ సెంటర్‌లో కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ సేవలు చిరస్మరణీయం: పార్టీ నాయకులు



**తొలివెలుగు, రామన్నపేట:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదిన వేడుకలను రామన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజా జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ముఖ్యంగా ఐటీ రంగం, పారిశ్రామికాభివృద్ధి, పట్టణాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ రాష్ట్ర ప్రగతిలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా కేటీఆర్ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, సర్పంచులు గర్దాస్ విక్రమ్, అంబటి ఉపేంద్ర, రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు రేఖ యాదయ్య, బందెల యాదయ్య, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, ఎస్కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్‌తో పాటు కూనూరు ముత్తయ్య, మిర్యాల మల్లేశం, బాలగోని నరసింహ, బొడ్డు అల్లయ్య, లవణం రాము, రవ్వ నరసింహ, ఆవుల నరేందర్, జెట్టి శివప్రసాద్, మామిళ్ల కుమార్, బుర్ర శ్రీశైలం, నల్ల సైదులు, గాదె శంకర్, కట్ట భాను శ్రీ, రాస వెంకటేశ్వర్లు, మోటి రవీందర్, గర్దాస్ కరుణాకర్, ఎండీ అజాజ్ ఖాన్, లవణం ఉపేందర్, నక్క శంకరయ్య, లింగారావు, బొడ్డుపల్లి రాజు, చిప్పలపల్లి రవి, నోముల లింగస్వామి, బాసాని రాజు, బీరం రాజిరెడ్డి, మేడబోయిన మహేష్, గట్టు రాములు, సంగిశెట్టి శివ, రేమిడాల వెంకన్న, వంగాల సాయి, సంఘీ ఐలయ్య, కొమ్మనగోని రమేష్, మోటె నరేష్, గంగాదేవి జంగయ్య, నోముల పెద్ద శంకర్, ఏషబోయిన బిక్షం, కోసనీ అంజయ్య, గట్టు సోములు, రాము, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోగులకు పండ్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ అందించిన సేవలు విశేషమని కొనియాడారు. పరిశ్రమలు, ఐటీ రంగం, పట్టణాభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తన వంతు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిలువేరు బాలనరసింహ, గునిగంటి మల్లేష్ గౌడ్, సర్పంచ్ శపక లింగస్వామి, కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి, రాపోలు కావ్య వేణు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముత్యాల మహిపాల్ రెడ్డి, పగిళ్ల సుధాకర్ రెడ్డి, కుంటోళ్ల మహేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు గుండు మధు, సామల మల్లారెడ్డి, మహిళ మండల, పట్టణ అధ్యక్షులు భవాని, గుండు రాజేశ్వరి, మహిళా నాయకురాలు కర్నాటి అంజమ్మ, నాయకులు పరసమోని సత్తయ్య, కొయ్యడ నరసింహ, మట్ట సుదర్శన్ గౌడ్, మన్నె పద్మారెడ్డి, యువజన నాయకులు గుండ్ల భాస్కర్, చింతకింది కిరణ్, సీతా శ్రవణ్, నోముల ఉపేందర్ రెడ్డి, భీమగాని శ్రీకాంత్, నల్ల లక్కీ తదితరులు పాల్గొన్నారు.

## సామేల్‌కు టికెట్ ఇప్పించి తప్పు చేశా.. 'వినాశకాలే విపరీత బుద్ధి'

తుంగతుర్తి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాజగోపాల్‌రెడ్డి 'ఫైర్'

టికెట్ కోసం వందసార్లు ఇంటికి వచ్చాడు.. నన్ను క్షమించండి!

పాత కేడర్ జోలికొస్తే ఊరుకోం.. కలెక్టరేట్‌లో మునుగోడు ఎమ్మెల్యే సంచలన కామెంట్స్




**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులతో జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆర్బిట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తనపై చేసిన వ్యాఖ్యలకు ఆయన తీవ్రంగా స్పందించారు. మందుల సామేల్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇప్పించడంలో తానే కీలక పాత్ర పోషించానని, టికెట్ కోసం ఆయన తన ఇంటికి ఎన్నోసార్లు వచ్చారని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. తన ఎమ్మెల్యే టికెట్‌తో పాటు తుంగతుర్తి, బాన్సువాడ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులుగా వరుసగా మందుల సామేల్, ఏనుగు రవీందర్‌లకు అధిష్ఠానం నుంచి టికెట్లు ఇప్పించేందుకు కృషి చేశానని చెప్పారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు తనపై విమర్శలు చేయడం బాధాకరమని, అయితే ఆ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి తప్పుడు వ్యక్తిని సూచించినందుకు అక్కడి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను క్షమాపణ కోరుతున్నానని వ్యాఖ్యానించారు. మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తన అభిమానులు ఎవరూ స్పందించవద్దని సూచించారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా, తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వ్యక్తినని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశానని తెలిపారు. తాను ఇతర పార్టీలోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్‌లో చేరినప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించే అధిష్ఠానం తిరిగి అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. 2009లో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండేదని, తాను పార్టీలో చేరిన తర్వాత పార్టీ మరింత బలోపేతమైందని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. మొదటి నుంచి కాంగ్రెస్ కోసం పనిచేసిన కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకూడదని, కొత్తగా పార్టీలో చేరిన వారి కారణంగా పాత కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటే తాము సహించబోమని హెచ్చరించారు. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్‌పై ఉందన్నారు. ఈ సందర్భంగా "వినాశకాలే విపరీత బుద్ధి" అంటూ మందుల సామేల్ వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# ఆగిపోయిన రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలి





- ఆత్మకూరు-మోత్కూరు రహదారిని పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి
- 3 రోజుల్లో పనులు ప్రారంభించకుంటే టెండర్ రద్దు చేస్తామని హెచ్చరిక
- హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**తొలివెలుగు, ఆలేరు/ఆత్మకూరు:** ఆగిపోయిన రహదారి నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం నుంచి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన నిర్మాణ పనులను మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి రోడ్డు పరిస్థితిని పరిశీలించిన మంత్రి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై వివరణ కోరారు. కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన మంత్రి, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు నుంచి మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. అలాగే యాదగిరిగుట్ట-తుర్కపల్లి రహదారిలో మిగిలి ఉన్న పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులో పనులు ప్రారంభించకపోతే సంబంధిత టెండర్‌ను రద్దు చేసి ఇతర ఏజెన్సీలకు అప్పగించి పనులు పూర్తి చేయిస్తామని హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం కలిగేలా అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. మంత్రి ఆదేశాలకు స్పందించిన కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లో పనులను తిరిగి ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని, ఆలేరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ అండ్ బి అధికారి సరిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాతృమూర్తి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు

- విద్యార్థులకు నోట్‌బుక్స్, ఆశ్రమానికి పండ్లు, బీరువాల పంపిణీ
- తల్లికి సేవా కార్యక్రమాలతో ఘన నివాళి అర్పించిన సర్పంచ్ వంశీదర్ రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** తల్లి జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల ద్వారా చిరస్థాయిగా నిలుపుకోవాలనే సంకల్పంతో మసీద్‌గూడెం గ్రామ సర్పంచ్ మర్రి వంశీదర్ రెడ్డి కుటుంబ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మసీద్‌గూడెం గ్రామానికి చెందిన కీ.శే. మర్రి సరస్వతి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, గ్రామ సర్పంచ్ మర్రి వంశీదర్ రెడ్డి, కుమార్తె మానస, అల్లుడు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సరస్వతి చిన్నతనంలో విద్యాభ్యాసం చేసిన నేలపట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల అవసరాల కోసం ఒక బీరువాను అందజేశారు. అనంతరం పెద్దకొండూర్‌లోని సాయి యాదాద్రి ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు ఆశ్రమ వినియోగం కోసం మరో బీరువాను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల జ్ఞాపకాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు, వృద్ధులకు అవసరమైన సహాయాన్ని అందించడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి రాంరెడ్డి, నేలపట్ల సర్పంచ్ గంగాపురం వసంత నగేష్ గౌడ్, మందోళ్లగూడెం ఉపసర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి, పెద్దకొండూర్ మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, పెద్దకొండూర్ ఉపసర్పంచ్ పిన్నిటి శ్రీనివాస్ రెడ్డి, కుటుంబ సభ్యులు పడమటి ఉమాదేవి, వాకిటి శివారెడ్డి, రామిడి జంగా రెడ్డి, పడమటి బలవంత్ రెడ్డి, సుర్కంటి సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## భద్రాచలం పద్మశాలి భవన్ ధర్మకర్తగా గోషిక వినాయక్‌కుమార్

- ధర్మకర్తలుగా గోషిక వినాయక్‌కుమార్, బడుగు రవికుమార్ ఎంపిక
- భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని నూతన ధర్మకర్తల హామీ

తొలివెలుగు, చౌటుప్పల్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు సేవలు అందించే ప్రతిష్ఠాత్మక అఖిల భారత మార్కండేయ పద్మశాలి భవన్ ధర్మకర్తల సభ్యులుగా చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినాయక్‌కుమార్, బడుగు రవికుమార్ ఎంపికయ్యారు. వీరి నియామకం పట్ల చౌటుప్పల్ పట్టణంలోని పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ధర్మకర్తలు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అన్నదాత సత్రం అధ్యక్షుడు గోషిక యాదగిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం క్షేత్రానికి వచ్చే భక్తులకు పద్మశాలి భవన్ ద్వారా మరింత మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు అంకితభావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవాభావంతో విధులు నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. గోషిక వినాయక్‌కుమార్, బడుగు రవికుమార్ ధర్మకర్తలుగా ఎంపిక కావడం పట్ల చౌటుప్పల్ పట్టణ పద్మశాలి సంఘం నాయకులు, ప్రతినిధులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు భక్తులకు ఆదర్శవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# సామేలును గెలిపించి తప్పు చేశా: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

'తుంగతుర్తిలో ఒక తప్పుడు వ్యక్తిని తీసుకొచ్చి టికెట్ ఇప్పించాను. నా పిలుపు మేరకు మందుల సామేల్‌ను ఎమ్మెల్యేగా గెలిచిపించిన కార్యకర్తలు, అభిమానులకు క్షమాపణలు కోరుతున్నా' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తనపై చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అని ఎమ్మెల్యే సామేలుపై కోమటిరెడ్డి మండిపడ్డారు. తుంగతుర్తి ఎమ్మెల్యే టికెట్ కోసం తన ఇంటికి సామేలు పలుమార్లు వచ్చారని, తాను తిరుపతిలో ఉన్నప్పుడు కూడా టికెట్ విషయమై ఫోన్‌లోనే కోరారని చెప్పారు. ఆ సమయంలో టికెట్ ఇప్పిస్తా, అసెంబ్లీకి పంపిస్తా.. అని సామేలుకు ఆనాడే తాను హామీ కూడా ఇచ్చానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇద్దరికి కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్లు ఇప్పించానని, వారిలో తుంగతుర్తిలో మందుల సామేలు ఉన్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో భువనగిరి లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు తుంగతుర్తిలో కూడా ప్రచారం చేశానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. తన మాట విన్న ఎందరో నాయకులు సామేలు గెలుపుకోసం తుంగతుర్తిలో సొంత డబ్బులు కూడా ఖర్చు చేసుకొన్నారని వివరించారు. అలా టికెట్ ఇప్పించి, గెలిపించిన తనపైనే అక్కసు వెళ్లగక్కుతున్నారంటే ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తుంగతుర్తితో తనకు సంబంధం లేకపోతే సీటు ఇప్పించాలని ఎందుకు తనను ఆయన అడిగారని ప్రశ్నించారు. గెలిచాక తన గురించి తప్పుగా మాట్లాడుతున్నారని, ఆయనపై తానెప్పుడూ తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు.




**కార్యకర్తలను ఇబ్బందులు పెడితే ఊరుకోను**

'నిన్నమొన్న వచ్చిన లీడర్లు కాంగ్రెస్ టికెట్ తీసుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు అయ్యిర్రి.. కార్యకర్తలను ఎక్కడ ఇబ్బందులు పెట్టినా ఊరుకునే ప్రసక్తే లేదు. ఈ ఆయారాం.. గాయారాంలకు భయపడేదిలేదు' అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక్క తుంగతుర్తి, నకిరేకల్ మాత్రమే కాదని, రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాల్లో కొత్తగా వచ్చిన నాయకుల వల్ల నిజమైన కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని, మొదటి నుంచి పార్టీలో ఉన్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. తెలంగాణ అంతటా పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత తనలాంటి నేతలపై ఉన్నదని పేర్కొన్నారు. నిజమైన కాంగ్రెస్ కార్యర్తలను కాపాడుకోవడానికి ఎంతదూరమైనా వెళ్తామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలను గౌరవించుకుంటామని, వారికి తాము వ్యతిరేకం కాదని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల రెక్కలకష్టంతో గెలిచి, వారిపైనే కేసులు పెడుతామంటే మాత్రం ఊరుకునే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. పార్టీ క్యాడర్‌ను గౌరవించాలని, వారికి న్యాయం చేయాలని, అవమానించొద్దని, ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. పార్టీ శ్రేణులు అందరూ సహనంతో ఉండాలని, ఎవరూ తొందర పడొద్దని, తనపై సామేల్ ఎన్ని వ్యాఖ్యలు చేసినా స్పందించవద్దని హితవు పలికారు. సామేలును గౌరవించాలని, ఆయనకు సహకరించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పోస్టులు, ప్రెస్‌మీట్లు పెట్టొద్దని కోరారు.

# కాంగ్రెస్ కోతల ప్రభుత్వం

- విద్యుత్ సరఫరా, సాగు, తాగు నీరందించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సోలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శించి సరఫరా రికార్డుల పరిశీలన

**బొమ్మలరామారం, జూలై 24:** 'ఎన్నికల్లో ఎన్నో హామీలంటూ కూతలు కూసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతులు కన్నీరు కార్చే విధంగా కరెంటు కోతలు విధిస్తూ ఇబ్బందులపాలు చేస్తోంది. ప్రజలకు నాణ్యమైన విద్యుత్, తాగు, సాగు నీరందించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మరణించిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి, సోలిపేట గ్రామాల్లో ఆలేరు మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు పర్యటించారు. మండల కేంద్రంలోని గుడి బావి చౌరస్తా వద్ద హరీశ్‌రావుకు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. హరీశ్‌రావుతో సెల్ఫీ దిగడానికి పోటీ పడ్డారు. సోలిపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిస్తే మొన్నటిదాక 14, 15 గంటల కరెంటు ఇచ్చినట్లు, ఈ వారం నుంచి కేవలం 12 గంటల కరెంటు అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు గమనించామన్నారు. ఆ 12 గంటల కరెంటు కూడా సక్రమంగా వస్తుందా..? అంటే మధ్యలో అంతరాయం కలుగుతోందన్నారు. కరెంటు సరఫరాకు మేమే పేటెంట్ అని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఉచిత కరెంటు అంటే ఉత్త కరెంటు ఇవ్వడమే మీ పేటెంటా? అని అన్నారు. 'కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలాగా రాష్ట్రమంతటా మిషన్ భగీరథ పథకం అమలు చేసి ఐదేళ్లు తాగునీటిని సరఫరా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కనీసం ఉన్నదాన్ని నడపడంలో కాంగ్రెస్ ఎందుకు ఫెయిల్ అయ్యింది. ఉన్నదాన్ని సక్రమంగా నడిపిస్తే బీఆర్ఎస్‌కు పేరొస్తుందని, కేసీఆర్‌ను ప్రజలు గుర్తు చేసుకుంటారని కావాలనే నీళ్లు ఇవ్వడం లేదు. సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, కామారెడ్డి, యాదాద్రి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని ఆవేదన చెందారు. 'ఆనాటి రోజులు తెస్తా.. అని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలు బిందెలు పట్టుకొని రోడ్ల మీదకు రావడం, ఎరువుల కోసం రైతులు చెప్పులు లైన్లలో పెట్టుకోవడం, ధాన్యం అమ్ముకోవాలంటే తరుగు తీయడం, కరెంట్ కోసం రైతులు ధర్నాలు చేయడం.. ఇదేనా ఆనాటి రోజులు తేవడం అంటే అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియోజకవర్గం తిప్పర్తి మండలంలో ఇండ్లు, సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు చేస్తున్నారని చెప్పారు. జగిత్యాల జిల్లా అయిలాపూర్, బాల్కొండ, కోహీర్ మండలం దిగ్వాల్, సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట, ఖాజీపూర్, సిరిసిల్ల జిల్లా నిజామాబాద్ సబ్‌స్టేషన్ల పరిధిలో మూడు రోజులుగా రాత్రిపూట కరెంటు సరిగా రావడం లేదని రైతులు ధర్నా చేస్తున్నారన్నారు. గతంలో కేసీఆర్ 23 వేల మెగావాట్ల విద్యుత్ స్థాపిత సామర్థ్యంతో రాష్ట్రాన్ని అప్పగిస్తే నేడు 15 వేల మెగావాట్ల కరెంటు కూడా అందడంలేదన్నారు. రాష్ట్రంలో కరెంటు కోతలే లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారని, 12 గంటల కరెంటు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొలగొని వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుశంగల సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బాలనర్సయ్య, మన్నె శ్రీధర్, పెద్దులు, మల్లారెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్, రాజ్‌కుమార్, బాల్‌సింగ్, సాయి, భాష, నర్సింహ, రమేశ్, సింహారెడ్డి పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌కు థర్మల్ ప్లాంట్ నడపడం చేతకాదా?**

కేసీఆర్ పెట్టిన యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంటులో రెండు యూనిట్లు ఎందుకు మూతపడ్డాయన్నారు. భద్రాది థర్మల్ పవర్ ప్లాంటులో 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. సింగరేణి, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంటును కట్టి కేసీఆర్ మీ చేతుల్లో పెడితే కాంగ్రెస్‌కు దాన్ని నడపడం చేతకావడంలేదని విమర్శించారు. 1870 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉ త్పత్తి ఎందుకు ఆగిపోయిందన్నారు. రేవంత్‌రెడ్డికి మనసులేక క రెంటు రావడం లేదన్నారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలని అన్న మాటలను గుర్తు చేశారు. హైదరాబాద్ ప్రజలకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లే రైతులకూ 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ అందించడమే బీఆర్ఎస్ విధానమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తగినంత విద్యుత్ ఉ త్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ రైతులకు కరెంటు కోతలు ఎందుకు విధిస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే పవర్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు అందించాలన్నారు. పథకాల్లో కో తలు లేకుండా ప్రజలకు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు.



## బిజినెస్

# ఫుడ్ డెలివరీలోకి ఫ్లిప్‌కార్ట్!

దేశీయ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి రావడానికి వాల్‌మార్ట్‌కు చెందిన ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే వచ్చే నెల రోజుల్లో ఓ పైలట్ ప్రాజెక్ట్‌ను చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాతే సాధ్యాసాధ్యాలను పరిశీలించి దేశవ్యాప్తంగా సేవల విస్తరణపై ఓ నిర్ణయం తీసుకుంటామని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి ఓ ప్రముఖ జాతీయ దినపత్రికకు స్పష్టం చేశారు. ఇదే జరిగితే ఈ రంగంలో ఇప్పటికే ఉన్న జొమాటో, స్విగ్గీ వంటి ప్రధాన సంస్థలకు ఫ్లిప్‌కార్ట్ నుంచి గట్టి పోటీ ఎదురవగలదన్న అంచనాలున్నాయి. కాగా, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో ఇప్పుడున్న పోటీని తట్టుకొని ఓ కొత్త సంస్థ నిలదొక్కుకొనే వీలుందనుకుంటున్నారా? అన్న ప్రశ్నకు కృష్ణమూర్తి బదులిస్తూ.. సరైన ప్రణాళికతో, బలమైన నెట్‌వర్క్, శ్రామిక శక్తితో విజయం లభించగలదన్న ధీమాను వ్యక్తం చేశారు.

ఇక గత ఆర్థిక సంవత్సరం దాదాపు 9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతీయ ఫుడ్ డెలివరీ మార్కెట్ విలువ.. 2029-30నాటికి 25 బిలియన్ డాలర్లకు చేరవచ్చని జెఫ్రీస్ అంచనా. జొమాటో, స్విగ్గీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ రంగంలోకి ర్యాపిడో వోన్లీ, ఓఎన్డీసీ ఆధారిత వేదికలూ వచ్చాయి. ఇక తీవ్రమవుతున్న పోటీ నేపథ్యంలో కస్టమర్లను ఆకట్టుకొనేందుకు 10 నిమిషాల్లోనే డెలివరీ అంటూ స్విగ్గీ బోల్ట్, బ్లింకిట్ బిస్ట్రో, జెప్టో కేఫ్‌ల వంటి సర్వీసులెన్నో పరిచయమయ్యాయి. మొత్తానికి ఫ్లిప్‌కార్ట్ ఎంట్రీ ఆలోచనలు ఇప్పుడు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో మిక్కిలి ప్రాధాన్యతాంశంగా నిలుస్తున్నాయి.




# జైలుకు ఎకోరిన్ ఎనర్జీ ఎండీ లక్ష్మీ ప్రసన్న

రూ.100 కోట్లకు పైగా జీఎస్టీ ఎగవేత కేసులో ఎకోరిన్ ఎనర్జీ ఎండీ లక్ష్మీ ప్రసన్నను అధికారులు శుక్రవారం నాంపల్లిలోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుపర్చారు. దీంతో న్యాయస్థానం 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించింది.



నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూలై 24 (నమస్తే తెలంగాణ) : రూ.100 కోట్లకు పైగా జీఎస్టీ ఎగవేత కేసులో ఎకోరిన్ ఎనర్జీ ఎండీ లక్ష్మీ ప్రసన్నను అధికారులు శుక్రవారం నాంపల్లిలోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుపర్చారు. దీంతో న్యాయస్థానం 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించింది. కాగా, మాదాపూర్ లోని ఎకోరిన్ సంస్థ కార్యాలయంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్న జీఎస్టీ అధికారులు.. నకిలీ ఇన్వాయిస్‌లు, టర్నోవర్ తారుమారు ద్వారా రూ.100 కోట్లకు పైగా పన్ను ఎగవేతకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే దర్యాప్తులో వెల్లడైన ముఖ్యాంశాలను రిమాండ్ రిపోర్టులో నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. ఇక ఈ కేసులో ఇతర కంపెనీలతో ఎకోరిన్ జరిపిన లావాదేవీలపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

# అమ్మకాల ఒత్తిడిలో మార్కెట్లు.. ఐదోరోజూ క్షీణించిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మొత్తం నష్టాలకే పరిమితమయ్యాయి. చివరి రోజైన శుక్రవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 331.62 పాయింట్లు లేదా 0.43 శాతం పడిపోయింది. ఒకానొక దశలోనైతే 916.96 పాయింట్లు దిగజారింది. అయితే తిరిగి కోలుకొని 76,059.77 పాయింట్ల వద్ద స్థిరపడింది.

**ఈ వారం సెన్సెక్స్ 2,092, నిఫ్టీ 567 పాయింట్లు డౌన్**



ముంబై, జూలై 24 : దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మొత్తం నష్టాలకే పరిమితమయ్యాయి. చివరి రోజైన శుక్రవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 331.62 పాయింట్లు లేదా 0.43 శాతం పడిపోయింది. ఒకానొక దశలోనైతే 916.96 పాయింట్లు దిగజారింది. అయితే తిరిగి కోలుకొని 76,059.77 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.15 పాయింట్లు లేదా 0.43 శాతం పతనమై 23,767.45 వద్ద నిలిచింది. దీంతో గత 5 రోజుల్లో సెన్సెక్స్ 2,091.68 పాయింట్లు, నిఫ్టీ 566.85 పాయింట్లు క్షీణించినైట్టెంది. కాగా, అమెరికా వాణిజ్య సుంకాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. మదుపర్లను పెట్టుబడుల ఉపసంహరణల దిశగా నడిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న ముడి చమురు ధరలు.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి.

**సెన్సెక్స్ షేర్లలో..**

ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు నిరాశపర్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్)గాను ఇన్ఫోసిస్ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు మదుపర్లను మెప్పించలేదు. దీంతో కంపెనీ షేర్ విలువ 1 శాతం నష్టపోయింది. అయితే బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.46 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.08 శాతం చొప్పున పెరుగడం విశేషం. ఇక రంగాలవారీగా.. ఆటో, టెలికాం, విద్యుత్తు, చమురు-గ్యాస్, రియల్టీ, మెటల్, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు నష్టాలకే పరిమితమయ్యాయి.

## స్పోర్ట్స్





# పారా స్విమ్మింగ్ ఫైనల్లో కార్తిక్, ఇమామ్..

# 90 కిలోలపై సందిగ్ధంలో ఒలింపిక్ విజేత..!

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ (Common wealth Games)లో భారత స్విమ్మర్లు అదరగొడుతున్నారు. పురుషుల పారా 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ ఎస్ 13 విభాగంలో కార్తిక్ బుడిగిన (ఖుతీప్త్రఱని దీబసఱన్త్రఱఖు), అలీ ఇమామ్(ూశ్రీఱ ×ఝఎ)లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో సత్తా చాటిన శ్రీహరి నటరాజ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. అయితే.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను (వీఱతీఝఓఝఱ జఢ్తుఱబ) మూడోసారి పసిడి పట్టేస్తుందనుంటే.. 90 కిలోల విభాగంలో 100 శాతం తన సామర్థ్యాన్ని వినియోగించలేని పేర్కొంది. తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడుతున్న కార్తిక్ బుడిగిన, అలీ ఇమామ్‌లో ఈత కొలనులో మెరిశారు. చూపు సరిగా లేని ఇద్దరూ పారా స్విమ్మింగ్ పోటీల్లో ఫైనల్ చేరి పతకానికి అడుగుదూరంలో నిలిచారు. కార్తిక్ 57.10 సెకన్లలో స్విమ్ పూర్తి చేసి మూడో స్థానంలో నిలవగా.. ఎస్ 12 ఈవెంట్లో 1:05.32 టైమింగ్‌తో అలీ ఫైనల్ బెర్తు సాధించాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో ఫైనల్ బెర్తు కోసంశ్రీహరి నటరాజ్ శనివారం ఉదయం 12:30గంటలకు ఈతకు సిద్ధమవ్వనున్నాడు.

# నేరుగా క్వార్టర్స్ నుంచే..

ఆసియా గేమ్స్‌లో భారత క్రికెట్ జట్లు (మెన్స్, ఉమెన్స్) నేరుగా క్వార్టర్స్ నుంచే బరిలోకి దిగనున్నాయి. ఇరు విభాగాల్లోనూ డిఫెండింగ్ చాంపియన్లుగా ఉన్న భారత్.. వరుసగా రెండో స్వర్ణం కోసం బరిలోకి దిగనుంది. మహిళల విభాగం మ్యాచ్‌లు సెప్టెంబర్ 17-22 మధ్య, పురుషుల కేటగిరీలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 దాకా జరుగుతాయి.దఅబ్బాయిల విభాగంలో పది జట్లు బరిలో ఉండగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ క్వార్టర్స్‌కు క్వాలిఫై అవగా అఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్ (గ్రూప్-ఏ), హాంకాంగ్, చైనా, మలేషియా (గ్రూప్-బీ) గ్రూప్ దశ మ్యాచ్‌లు ఆడతాయి. దాయాదుల పోరు సెమీస్‌లో ఉండే అవకాశముంది. అమ్మాయిల విషయానికొస్తే 8 జట్లూ (భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, జపాన్, చైనా, మలేషియా, థాయ్‌లాండ్) క్వార్టర్స్‌కు క్వాలిఫై అయ్యాయి.



# శ్రేయస్ అయ్యర్ అరుదైన వరల్డ్ రికార్డు.. వరుసగా 8 టాస్‌లు గెలిచి సరికొత్త చరిత్ర

టీమిండియా కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వరుసగా ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన తొలి సారథిగా చరిత్ర సృష్టించాడు. ఈ రికార్డుతో ఇప్పటివరకు ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ప్రత్యేక రికార్డును కూడా అధిగమించాడు. ఈ రికార్డు ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా ఏడు టాస్‌లు గెలిచిన బహామాస్ కెప్టెన్ గ్రెగొరీ టేలర్‌పై ఉంది. అదే విధంగా, 2010 నుంచి 2012 మధ్య టీమిండియాకు నాయకత్వం వహించిన ఎంఎస్ ధోనీ కూడా వరుసగా ఏడు టాస్‌లు గెలిచి భారత రికార్డు సృష్టించారు. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్ వరుసగా ఎనిమిది టాస్‌లు గెలిచి ఇద్దరి రికార్డులను అధిగమిస్తూ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు.దటాస్ విషయంలో అదృష్టం కలిసొచ్చినట్లే, మ్యాచ్ ఫలితంలో కూడా శ్రేయస్ అయ్యర్‌కు శుభారంభమే లభించింది. హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో టాస్ గెలిచిన అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 125/7 పరుగులకే పరిమితమైంది. భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తన వేగవంతమైన బౌలింగ్‌తో రెండు కీలక వికెట్లు పడగొట్టి 2/18 గణాంకాలు నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గాను అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.ఇక 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తుఫాన్ ఆరంభాన్ని అందించాడు. కేవలం 18 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పేసింది.వైభవ్ ఇచ్చిన బలమైన ఆరంభాన్ని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28లి), ఇషాన్ కిషన్ (35) చక్కగా కొనసాగించారు. ఇద్దరూ బాధ్యతాయుతంగా ఆడి భారత్‌ను ఎలాంటి ఒత్తిడి లేకుండా విజయతీరాలకు చేర్చారు. భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఒకవైపు వరల్డ్ రికార్డు, మరోవైపు కెప్టెన్‌గా తొలి విజయం సాధించిన శ్రేయస్ అయ్యర్‌కు ఈ మ్యాచ్ చిరస్మరణీయంగా మారింది. యువ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో భారత జట్టు సిరీస్‌ను విజయంతో ప్రారంభించగా, మిగతా రెండు మ్యాచ్‌లపైనా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

